క్లుప్తంగా

ఎస్‌సీఈఆర్‌టీకి ఉపాధ్యాయుడి ఎంపిక



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ట్రెనింగ్)కు మండల పరిధిలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఎస్. కృష్ణమూర్తి ఎంపికయ్యారు. ఉద్యోగ రీత్యా ఐదు సంవత్సరాలుగా పాఠశాలకు ఒక్క సీఎల్ కానీ మరే ఇతర సెలవులు పెట్టలేదు. 2024–25 విద్యాసంవత్సరానికి ఎస్‌సీఈఆర్‌టీకి ఎంపిక కావడం పట్ల తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ విఠల్, టీచర్లు అందె రామచంద్రం, జి. శివకుమార్, కె. విద్యాప్రకాశ్, ఎస్.సురేశ్, టి.వినోద పాల్గొన్నారు.

బాలసాహిత్య సమావేశం విజయవంతం చేద్దాం



బాలసాహిత్య సమావేశం కరపత్రం ఆవిష్కరిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 5న జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో పెందోట బాలసాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాలసాహిత్య సమావేశాన్ని విజయవంతం చేద్దామని, పెందోట బాలసాహిత్య పీఠం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పట్టణంలో బాలసాహిత్య సమావేశానికి సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో భాగంగా 2024 కవితల పోటీలలోని విజేతలకు బహుమతులు ప్రదానం, పలు పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కాసర్ల నరేశ్ రావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో చంద్రయ్య, వరికోలు లక్ష్మయ్య, కోణం పర్శరాములు, నార్లపురం రాములు, అనిశెట్టి సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సిబ్బందికి అభినందనలు



నాచగిరి ఆలయ అర్చక, సిబ్బందితో ఈఓ అన్నపూర్ణ

వర్గల్(గజ్వేల్): కార్తీక మాసంలో ఉత్తమ సేవలందించిన సిబ్బందిని నాచగిరి ఆలయ ఈఓ అన్నపూర్ణ అభినందించారు. గురువారం రాత్రి ఆలయ ముఖమండపంలో సిబ్బందితో కలిసి ఆలయ ఆమె సమావేశమయ్యారు. కార్తీక దీపోత్సవం, రాష్ట్ర ప్రభుత్వ విజయోత్సవ నిత్య కార్యక్రమాలు, ఇతర సేవలను సమర్థవంతంగా నిర్వహించామన్నారు. దీనికి ఆలయ ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది సహకారం ఎంతో ఉందన్నారు. సిబ్బందిని అభినందిస్తూ స్వామి వారి శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం చేయాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ఆటో బోల్తా ప్రమాదంపై ఎమ్మెల్యే సునీతారెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావనికి సూచించారు. శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కుల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారందరికి మెరుగైన వైద్యం చేయాలని, తీవ్రంగా గాయపడని వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పంపి అవసరమైన వైద్యం అందజేయాలని సూచించారు. గాయాలపాలైన వారి కుటుంబ సభ్యులతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హత్నూర మండలం చందాపూర్‌కు చెందిన తేజకు రూ.లక్ష ఎల్‌ఓసీని సునీతారెడ్డి అందచేశారు. చిలిపిచెడ్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రమేష్, ప్రవీణ్‌కుమార్, వినీలా, మల్లేశం, శేఖమ్మ తదితరులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేశారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీనివాస్‌రెడ్డి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. గురువారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాస్‌రెడ్డి వెంట పార్టీ నాయకులు చెరుకు విజయ్‌రెడ్డి, సోలిపేట ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

–దుబ్బాక



డీఎంహెచ్‌ఓకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్‌ను సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనోత్సాహంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పల్వన్‌కుమార్ తెలిపారు. ప్రణాళికలతో అన్ని ఆరోగ్య కార్యక్రమ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా సిబ్బంది సహకరించాలన్నారు.

– సిద్దిపేటకమాన్

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

● డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రానున్న పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు ముందుకు సాగాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. పాఠశాలల అభివృద్ధికి, పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల విద్యాధికారి యాదవ రెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట కిరణ్, జిల్లాకార్యదర్శులు ప్రశాంత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, కనకరాజు, జిల్లా కమిటీ సభ్యులు తలారి కనకయ్య, నరసింహులు, రాజు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడి, యూటీఎఫ్ నాయకులు

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 31 మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా గురువారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.69వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి



శివచరణ్‌రెడ్డిని శాలువ కప్పి సన్మానిస్తున్న దుబ్బాక యూత్ కాంగ్రెస్ నాయకులు

దుబ్బాకటౌన్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయన గెలిచిన సందర్భంగా గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో యూత్ కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బురాని శ్రీకాంత్, దుబ్బాక మున్సిపల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కడవెర్గు గోపి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దుబ్బాక నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా గెలుపు పొందిన శ్రీకాంత్‌ను సైతం శివ చరణ్ సత్కరించారు. యువత పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

చదువుల్లో రాణించాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సీపీడీసీ(కాలేజీ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ) సభ్యుడు తలకొక్కుల లక్ష్మణ్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు గురువారం తలకొక్కుల చంద్రకళ-లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎనిమిది ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువుల్లో రాణించి ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు ఇష్టంతో చదివి ఎంచుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగాలన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా బీజేపీ



రవీందర్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎంపీ రఘునందన్

● ఎంపీ రఘునందర్‌రావు

నంగునూరు(సిద్దిపేట): ప్రతీ బీజేపీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంపీ రఘునందర్‌రావు అన్నారు. అప్పలాయిచెర్వులో ఇటీవల మరణించిన బీజేపీ ఓబీసీ నంగునూరు మండలాధ్యక్షుడు గట్టు రవీందర్ గుండెపోటుతో మరణించగా అతని కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. ఆపై ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ పటిష్టానికి కృషి చేసి చిన్న వయసులోనే మరణించిన రవీందర్ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ ఫిట్‌మెంట్‌ను ప్రకటించండి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ ఫిట్‌మెంట్ (మూల వేతన పెంపు)ను 50 శాతం ప్రకటించాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సిద్ధి వెంకటేష్ డిమాండ్ చేశారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల వనరుల కేంద్రంలో గురువారం ఏంఈఓ అంజాగౌడ్‌తో కలిసి ఆయన పీఆర్‌టీయూ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం 2 డీఏల విడుదల, సీపీఎస్ రద్దు, హెల్త్ కార్డుల జారీకి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ ఎప్పుడూ ముందంజలో ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి బెంద్రం చంద్రారెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, బాలకిషన్, భగవాన్, మధుసూదన్‌రెడ్డి, హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం చిన్నకోడూరులో తహసీల్దార్ జయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మిక సంఘం మండల అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వాలు మారినా కార్మికుల బతుకులు మారడం లేదన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో..

మద్దూరు(హుస్నాబాద్): డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ 2025 క్యాలెండర్‌ను మండలంలోని రేబర్తి గ్రామంలో ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈవో వరదరాజు ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సమస్యల పట్ల నిత్యం పోరాటం చేసేటువంటి సంఘం డెమొక్రటిక్ టీచర్స్ సంఘం అని అన్నారు. ఈఫెడరేషన్ ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో కృషి చేస్తోందన్నారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు.

నేరాల నివారణకు సీసీ కెమెరాలు కీలకం

● సీఐ ఉపేందర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేరాల నివారణకు సీసీ కెమెరాలు కీలకంగా మారుతాయని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని బృందావన కాలనీలో సీసీ కెమెరాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్ మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల దొంగతనాలతో పాటుగా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఉంటాయన్నారు. సీసీలు కాలనీ ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీ రక్షణగా 24 గంటలు నిలుస్తాయన్నారు. వాటి ఏర్పాటుకు కాలనీ పెద్దలు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు ముందుకు రావాలని సూచించారు. కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గజ్వేల్‌రూరల్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 20మంది వాహనదారులు పట్టుబడినట్లు తెలిపారు. గురువారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ఎదుట హాజరుపర్చగా విచారణ అనంతరం వారికి ఒక్కొక్కరికీ రూ. 14వేల జరిమానా విధించినట్లు తెలిపారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేందర్

వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపవద్దని, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ సీఐ సైదా పేర్కొన్నారు. పట్టణంలోని ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు గుడ్ అండ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, షీటీమ్, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ సైదా మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుల్లో రాణించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపవద్దని, సెల్‌ఫోన్‌లకు వచ్చే మెసేజ్‌లు, ఓటీపీలకు స్పందించ వద్దన్నారు.

మహిళలు, యువత ఆర్థికాభివృద్ధి సాధించాలి

● మున్సిపల్ ఛైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: మహిళలు, యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ రజిత అన్నారు. ముద్ర లోన్ కింద స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి మంజూరైన ఆటోను పట్టణంలోని 15వ వార్డుకు చెందిన ఒక మహిళ సభ్యురాలి భర్తకు మహమ్మద్ ఖయ్యూంకు అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ పథకం ద్వారా క్యాంటీన్ నిర్వహణ కోసం మెప్మాకు చెందిన భవానీ స్వయం సహాయక సంఘ సభ్యులకు బ్యాంక్ ద్వారా రూ.11 లక్షలు మంజూరు చేశామన్నారు. వ్యాపార నిమిత్తం స్త్రీనిధి, ముద్ర, పీఎం ఈజీపీ ఇలా పలు పథకాల ద్వారా రుణం తీసుకునే అవకాశం మహిళలకు ఉందన్నారు. ప్రతీఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ప్రణీత్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మెప్మా టీఎంసీ ముత్యాల రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, రవికుమార్‌లు పాల్గొన్నారు.



ఖయ్యూంకు ఆటో అందజేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రజిత

● నిధుల మంజూరుకు వినతి



మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలయ్య కోరారు. గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రామ శివారుపల్లె ఒడ్డెర కాలనీకి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణంతో పాటు చెరువు మత్తడి దగ్గర బ్రిడ్జి నిర్మించాలని కోరామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి, అభివృద్ధికి నిధులు మంజూరుకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. బాలయ్య వెంట గ్రామస్తులు ఉన్నారు.

– హుస్నాబాద్‌రూరల్

ఉత్తర్వులు ఉపసంహరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెకు దిగిన సందర్భంగా ప్రాథమిక పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపే ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని టీపీటీఎఫ్ అక్బర్‌పేట–భూంపల్లి మండల శాఖ అధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై తీసుకోవడం ద్వారా ఆ పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతుందన్నారు. దీంతో విద్యార్థులు విద్యపరంగా నష్టపోయే పరిస్థితులు నెలకొంటాయన్నారు. సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు తక్కువ వేతనంతో పని చేస్తూ, విద్యాశాఖకు ఎనలేని సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించి పాఠశాలల విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ **రామంచ విద్యార్థుల ప్రతిభ**

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలుగు భాషా పరిరక్షణకు కెనడాలో నివసిస్తున్న తెలుగు వారు నడిపిస్తున్న అంతర్జాతీయ పిల్లల మాసపత్రిక గడుగ్గాయ్ కథల పోటీలు గురువారం ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని రామంచ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. గాయిత్రి, వర్షిణి, సాత్విక్, అక్షిత, ఇందు, శృతి, ఐశ్వర్యలు.. నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. వారిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

◆ **పంచాయతీ భవనం మంజూరు చేయండి**



అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం పంతులు తండా గ్రామ పంచాయతీ నూతన భవనం మంజూరు చేయాలని తండా యువకులు కోరారు. ఎంపీడీఓ బానోతు జయరాం, డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడారు. గ్రామపంచాయతీ (జీపీ) ఏర్పడి ఐదేళ్లు పూర్తయినా గానీ సొంతత భవనం లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో ఓ తరగతి గదిలో జీపీ కార్యాలయం కొనసాగుతోందన్నారు. వెంటనే భవనం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో తండా యువకులు లావుడియా రైనా నాయక్, ఎంపీఓ గుగులోతు మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **హుండీ లెక్కింపు**



హుస్నాబాద్: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహించారు. లెక్కింపులో రూ.3,00,286 ఆదాయం ఆలయానికి సమకూరింది. మిశ్రమ బంగారపు రాళ్లతో 72 గ్రాములు, మిశ్రమ వెండి రాళ్లతో 800 గ్రాములు భక్తులు కానుకగా సమర్పించారు. ఈ డబ్బులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హుస్నాబాద్ బ్రాంచ్‌లో దేవాలయ అకౌంట్‌లో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా దేవాదాయ ధర్మాదాయ పర్యవేక్షణాధికారి విజయలక్ష్మి, ఆలయ కార్యనిర్వాహణాధికారి కిషన్‌రావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు పూదరి లక్ష్మీనారాయణగౌడ్, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

◆ **నేడు న్యాయ విజ్ఞాన సదస్సు**

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట కేసీఆర్ నగర్ బాయ్స్ స్కూల్‌లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించనున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి గురువారం తెలిపారు. పిల్లల కోసం పిల్లల స్నేహపూర్వక న్యాయసేవలు అనే అంశంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు.

◆ **ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్**

నంగునూరు(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చిన్నకోడూర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్థానంలో పనిచేసిన కిషన్ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఆ మేరకు శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

◆ **కందుల కేంద్రం ఏర్పాటు చేయాలి**



చేర్యాల(సిద్దిపేట): కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కత్తుల భాస్కర్‌రెడ్డి కోరారు. తహసీల్దార్ సమీర్ అహమ్మద్‌ఖాన్‌కు గురువారం వినతిపత్రం అందించారు. వెంటనే కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, దళారుల చేతిలో రైతులు మోసపోకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు రైతులు ఉన్నారు.

◆ **బాలల హక్కులపై అవగాహన**



దౌల్తాబాద్ (దుబ్బాక) : దౌల్తాబాద్ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని దొమ్మాటలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల రక్షణ సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల పరిరక్షణ కౌన్సెలర్ నర్సింహులు మాట్లాడుతూ విద్యార్థులకు చైల్డ్ రైట్స్, పోక్సో యాక్ట్, బాల్యవివాహాలు పర్యావసానాలపై అవగాహన కల్పించారు. ఏమైనా సమస్యలు ఉంటే 1098 కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **సీఎం కప్ పోటీల్లో ప్రతిభ**

చిన్నకోడూరు(సిద్దిపేట): సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో మెట్‌పల్లి విద్యార్థి సిరిచందన రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపింది. షాట్‌పుట్ విభాగంలో మూడవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బాలికను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

◆ **రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని సత్తా**

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో 7వ తరగతి విద్యార్థిని జ్యోత్స్న ప్రతిభ చాటిందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సీవ్లరాజ్ తెలిపారు. గత నెల 19న జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో పాల్గొందని పేర్కొన్నారు. అయితే జిల్లా స్థాయి సీఎం కప్‌లో అండర్–14 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిందని తెలిపారు. గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులంతా కలిసి విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిందే**

తొగుట(దుబ్బాక): మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈఓ నాగార్జున రైతులకు సూచించారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి కుకునూరుపల్లి రమేశ్ సాగు చేసిన మొక్కజొన్న పంటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసిన 15 రోజుల నుంచి కోత వరకు కత్తెర పురుగు ఆశిస్తోందన్నారు. కంకిదశకు వరకు నివారణ కోసం పురుగు మందును స్ప్రే చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మోతాదుకు మించి మందులు వాడరాదని రైతులకు సూచించారు. స్ప్రే చేసే క్రమంలో కళ్లద్దాలు, మాస్క్, గ్లౌజులు, తప్పనిసరిగా ధరించాలన్నారు. మొక్కజొన్నకు మందు స్ప్రే చేసుకునే విధానం గురించి తెలిపారు.

